


# ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్,సంపుటి :01,సంచిక : 105,చీఫ్ ఎడిటర్ : వి.శివ కృష్ణ, వెల : 02,సోమవారం, తేదీ : 17-07-2026

## తిరుమలలో భారీ రద్దీ.. దర్శనానికి సుదీర్ఘ నిరీక్షణ



తిరుమలకు పోటెత్తిన భక్తులు

శ్రీవారి సర్వదర్శనానికి 22 గంటల సమయం

నిండిపోయిన వైకుంఠం క్యూ కాంప్లెక్స్ కంపార్ట్‌మెంట్లు

శనివారం 90 వేల మందికి పైగా స్వామివారి దర్శనం

తిరుపతి : వరుస సెలవుల నేపథ్యంలో తిరుమలలో భక్తుల రద్దీ భారీగా పెరిగింది. శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో తిరుమల గిరులు భక్తజనసందోహంతో కిటకిటలాడుతున్నాయి. ప్రస్తుతం శ్రీవారి సర్వదర్శనం కోసం భక్తులు దాదాపు 22 గంటల పాటు వేచి ఉండాల్సి వస్తోంది. మిగతా..2లో

## టీజీపీఎస్సీ కీలక ప్రకటన.. వచ్చే వారం నుంచి ఉద్యోగ నోటిఫికేషన్ల జాతర!




వచ్చే వారం నుంచి వరుసగా ఉద్యోగ నోటిఫికేషన్లు

పారదర్శకతే లక్ష్యంగా టీజీపీఎస్సీ నియామక ప్రక్రియ

ప్రతి ఆరు నెలలకు ఒకసారి పోటీ పరీక్షల నిర్వహణకు సర్కార్ ప్లాన్

ఇప్పటికే 70 వేల ఉద్యోగాల భర్తీ పూర్తి చేశామన్న సీఎం రేవంత్

వదంతులు నమ్మొద్దని, ప్రిపరేషన్‌పై దృష్టి పెట్టాలని యువతకు సూచన

హైదరాబాద్: తెలంగాణలోని నిరుద్యోగ యువతకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేస్తూ వచ్చే వారం నుంచి వివిధ శాఖల్లోని ఖాళీల భర్తీకి వరుసగా నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రకటించింది. మరోవైపు ప్రభుత్వ శాఖల్లో ఏర్పడే ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేసేందుకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి పోటీ పరీక్షలు నిర్వహిస్తామని మిగతా..2లో

## నేటి అర్ధరాత్రితో విశాఖకు విమానాల రాకపోకలు బంద్




- ఇవాళ అర్ధరాత్రి నుంచి విశాఖ విమానాశ్రయం సేవలు సమాప్తం
- భోగాపురం విమానాశ్రయం నుంచి ఆగస్టు 17 నుంచి విమాన రాకపోకలు ప్రారంభం
- ఈ నేపథ్యంలో విశాఖ విమానాశ్రయం నుంచి విమానాలు నిలిపివేత

ఢిల్లి : ప్రతి ప్రాంతానికి ఒక చరిత్ర ఉంటుంది. అంతేకాకుండా, దానితో ముడిపడి ఉన్న ప్రత్యేక అనుభవాలు, అనుభూతులు ఉంటాయి. ఒక ప్రదేశం ఇకపై అక్కడ ఉండదని హఠాత్తుగా తెలిస్తే. తలచుకుంటూనే మనసంతా ఏదోలా ఉంది కదూ. ఇదంతా విశాఖ విమానాశ్రయం గురించే. ఎందుకంటే దీనికి 80 సంవత్సరాల చరిత్ర ఉంది. నేటి అర్ధరాత్రి నుంచి విశాఖ ఎయిర్ పోర్ట్ సేవలు సమాప్తం కానున్నాయి. దీంతో ఈ విషయాన్ని

## చంద్రగిరిలో ఏనుగుల బీభత్సం..

# రంగంలోకి దిగిన పవన్ కల్యాణ్

- ★ చంద్రగిరి సమీపంలో ఏనుగుల సంచారంతో ప్రజలు ఆందోళన
- ★ అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశం
- ★ డ్రోన్లతో నిఘా, రాత్రి పూట గస్తీ పెంచాలని కీలక సూచనలు
- ★ పంట నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం అందిస్తామని హామీ
- ★ పరిస్థితిని బట్టి హనుమాన్ బృందాలను మోహరించాలని ఆదేశం



అమరావతి : తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలోని ఎర్రవారిపాలెం మరియు సమీప గ్రామాల్లో ఏనుగుల గుంపు సంచారం స్థానికంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. శేషాచలం అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఈ ఏనుగులు రాత్రివేళల్లో పంట పొలాలపై పడి తీవ్ర నష్టాన్ని కలుగజేస్తున్నాయి. ఈ విషయంపై స్పందించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్, ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అటవీశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. మిగతా..2లో

## ఘనంగా జనని-సూర్యతేజ వివాహం..

## సతీసమేతంగా హాజరైన ఏపీ సీఎం చంద్రబాబు..

- హైదరాబాదులో ఘనంగా జరిగిన బండ్ల గణేశ్ కుమార్తె జనని వివాహం
- పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సూర్య తేజతో ఏడడుగులు
- హాజరై నూతన దంపతులను ఆశీర్వదించిన సీఎం చంద్రబాబు
- హైదరాబాద్ వేదికగా జరిగిన వేడుకకు రాజకీయ, సినీ ప్రముఖులు



అమరావతి : ప్రముఖ సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ ఇంట పెళ్లి బాజాలు మోగాయి. ఆయన కుమార్తె జనని వివాహం ఆదివారం హైదరాబాద్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సూర్య తేజతో ఆమె ఏడడుగులు వేశారు. ఈ వివాహ వేడుకకు రాజకీయ, సినీ రంగాలకు చెందిన అగ్ర ప్రముఖులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. నగరంలోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ వేడుకకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తన అర్ధాంగి నారా భువనేశ్వరితో కలిసి విచ్చేశారు. ఈ సందర్భంగా వారు నూతన వధూవరులు జనని, సూర్య తేజ వద్దకు వెళ్లి అక్షింతలు వేసి ఆశీర్వదించారు. వారికి ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షిస్తూ, బండ్ల గణేశ్ కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, తన కుమార్తె పెళ్లి వేడుకకు మిగతా..2లో

## రష్యా ఖేల్ ఖతం.. 1000 కుపైగా డ్రోన్ లతో విధ్వంసం




- రష్యా- ఉక్రెయిన్ మధ్య భీకర దాడులు జరుగుతున్నాయి.
- ఇరు దేశాల మధ్య నాలుగేళ్లుగా యుద్ధ వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే.
- ఉక్రెయిన్ నుంచి వచ్చిన 800 కు పైగా డ్రోన్ లను తాము కూల్చేసినట్లు రష్యా ధ్రువీకరించింది.

## వందేమాతరం గేయాన్ని కాంగ్రెస్ అవమానించింది

## వారికి క్షమాపణలు చెప్పాలి'

- ❖ ప్రజలు, గేయరచయిత బంకించంద్ర ఛటోపాధ్యాయకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్
- ❖ ఓటుబ్యాంకు రాజకీయాల కోసమే వందేమాతరంను కాంగ్రెస్ విస్మరించిందని విమర్శ




ఢిల్లి : జాతీయ గేయం వందేమాతరంను కాంగ్రెస్ పార్టీ అవమానించిందని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆరోపించారు. ఈ గేయాన్ని రచించిన బంకిం చంద్ర చటోపాధ్యాయతోపాటు దేశ ప్రజలకు ఆ పార్టీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రాజస్థాన్ చిత్తోర్‌గఢ్‌లో జరిగిన ఓ సభలో పాల్గొన్న అమిత్ షా, శనివారం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన పంద్రాగస్టు వేడుకల్లో వందేమాతరం గేయాన్ని మధ్యలోనే ఆపేయాలని సోనియా కోరినట్లు ఆరోపించారు. ఆ దృశ్యాలను దేశమంతా టీవీల్లో చూసిందన్నారు. వందేమాతరాన్ని పాడినందుకు స్వాతంత్ర్య సమరయోధులు తూటాలు, లాఠీ దెబ్బలను తిన్నారని, మిగతా..2లో

# మోదీ అజెండా తనను తాను కాపాడుకోవడమే

- ❖ మహిళ రిజర్వేషన్ల అమలుపై మోదీ చేసిన విజ్ఞప్తిపై కాంగ్రెస్ విమర్శలు
- ❖ అదొక నాటకంగా అభివర్ణన
- ❖ ఎర్రకోట నుంచి నీతులు చెప్పడం మానుకోవాలని మోదీకి హితవు




ఢిల్లి : మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన డీలిమిటేషన్ అనుబంధ బిల్లుకు మద్దతు ఇవ్వాలని ప్రతిపక్షాలకు ప్రధాని నరేంద్ర మోదీ చేసిన విజ్ఞప్తిపై కాంగ్రెస్ స్పందించింది. ఈ విజ్ఞప్తిని ఒక నాటకంగా అభివర్ణించింది. మోదీ ఏకైక అజెండా మహిళా రిజర్వేషన్ కాదని, తనను తాను కాపాడుకోవడమేనని ఎద్దేవా చేసింది.

## ప్రధాని నరేంద్ర మోదీకి మంత్రి పొన్నం లేఖ




- ఓబీసీ, ఎస్ఈబీసీల సమగ్ర కులగణకు ప్రత్యేక విధానం రూపొందించాలి.
- ప్రతి కులం, సముదాయానికి డిజిటల్ కోడ్‌లు కేటాయించాలి.

హైదరాబాద్: 2027 జనాభా లెక్కల్లో ఓబీసీలకు ప్రత్యేక కేటగిరీ ఏర్పాటు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీకి తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ప్రధానికి లేఖ రాశారు పొన్నం. ' ఓబీసీ, ఎస్ఈబీసీల సమగ్ర కులగణకు ప్రత్యేక విధానం రూపొందించాలి. ఎస్సీ, ఎస్టీలతో పాటు ఓబీసీలకు ప్రశ్నావళిలో ప్రత్యేక కేటగిరి చేర్చాలి. ప్రతి కులం, సముదాయానికి డిజిటల్ కోడ్‌లు కేటాయించాలి. కులగణనలో బీసీల సమాచారాన్ని సేకరించాలి. బీసీల లెక్కలు తేలితేనే సామాజిక న్యాయం జరుగుతుంది. ాజుజజ-2011లో ఎదురైన కులపేర్ల సమస్యలు 2027 జనాభా లెక్కల్లో పునరావృతం కాకూడదు. రాష్ట్రాల వారీగా మాస్టర్ కుల డైరెక్టరీ..

# రాష్ట్రానికి పట్టిన శనీశ్వరులు వాళ్లే

- ములుగు జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.
- తొలుత చారిత్రాత్మక మేడారంలో పర్యటించిన సీఎం, గిరిజన సంస్కృతి సంప్రదాయాల నడుమ డోలు వాయిద్యాల మధ్య వనదేవతలను దర్శించుకున్నారు.



హైదరాబాద్: పూజారులు ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద వనదేవతలకు నిలువెత్తు బంగారం (బెల్లం), చీర, సారె, పసుపు, కుంకుమలు సమర్పించి సీఎం రేవంత్‌రెడ్డి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. మిగతా..2లో

## కేసీఆర్ పాలనకు మీ పిల్లలే రిపోర్టు కార్డు ఇస్తున్నారు



- బీఆర్ఎస్, మాజీ మంత్రి కేటీఆర్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ షాకింగ్ కామెంట్స్ చేశారు.
- బీఆర్ఎస్ పదేళ్లు తెలంగాణను పాలించిందని...
- కానీ ఇప్పుడు అధికారం కోల్పోయిన తర్వాత, అకస్మాత్తుగా 'భారత్‌లో మంచి కాలేజీలు లేవు' అని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

హైదరాబాద్, ఆగస్టు 16 : బీఆర్ఎస్, మాజీ మంత్రి కేటీఆర్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ షాకింగ్ కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్ పదేళ్లు తెలంగాణను పాలించిందని... కానీ ఇప్పుడు అధికారం కోల్పోయిన తర్వాత, అకస్మాత్తుగా 'భారత్‌లో మంచి కాలేజీలు లేవు' అని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారు? అని ప్రశ్నించారు. మంచి పాఠశాలలు, కాలేజీలు ఎందుకు ఏర్పాటు చేయలేకపోయారు? అని నిలదీశారు. మిగతా..2లో

ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక

సోమవారం 17-08-2026

## మొదటి పేజి తరువాయి

## ఘనంగా జనని-సూర్యతేజ వివాహం.. సతీసమేతంగా హాజరైన ఏపీ సీఎం చంద్రబాబు..

చంద్రబాబు సతీసమేతంగా రావడం పట్ల బండ్ల గణేశ్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఓ దశలో ఏడ్చేశారు. దాంతో పక్కనే ఉన్న సీనియర్ నటుడు బ్రహ్మాజీ ఆయనను ఊరడించారు. కాగా, వరుడు సూర్యతేజ సీఎం చంద్రబాబు-నారా భువనేశ్వరిల చేతులమీదుగా తాళి అందుకుని వధువు మెడలో మంగళసూత్రధారణ చేయడం విశేషం. బండ్ల గణేశ్ కు సినీ, రాజకీయ రంగాల్లో మంచి సంబంధాలు ఉన్న నేపథ్యంలో, ఈ వివాహ వేడుకకు ఇరు రంగాలకు చెందిన నాయకులు, నటీనటులు, నిర్మాతలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వారి రాకతో వివాహ ప్రాంగణం సందడిగా మారింది. అతిథులను బండ్ల గణేశ్ దంపతులు సాదరంగా ఆహ్వానించి, వారి బాగోగులు చూసుకున్నారు. ఈ వివాహ వేడుకకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## తిరుమలలో భారీ రద్దీ.. దర్శనానికి సుదీర్ఘ నిరీక్షణ

తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ భక్తులతో పూర్తిగా నిండిపోయాయి. దీంతో క్యూ లైన్లు వెలుపలికి కిలోమీటర్ల మేర విస్తరించాయి. రద్దీ పరిస్థితులను టీటీడీ ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. క్యూ లైన్లలో గంటల తరబడి వేచి ఉంటున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, పాలు, అన్నప్రసాదాలను నిరంతరాయంగా అందజేస్తున్నారు. శనివారం (ఆగస్టు 15న) ఒక్కరోజే స్వామివారిని 90,293 మంది భక్తులు దర్శించుకున్నారు. వీరిలో 53,090 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.81 కోట్లు వచ్చినట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు. రానున్న రోజుల్లో రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్నందున, వృద్ధులు, చిన్నపిల్లలతో వచ్చే భక్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

## రాష్ట్రానికి పట్టిన శనీశ్వరులు వాళ్లే

ఈ పవిత్ర వేదికపై మంత్రితో పాటు ఇతర నాయకులకు మంత్రి సీతక్క రాఖీలు కట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ములుగు చేరుకున్న సీఎం, గట్టమ్మ దేవాలయం వద్ద హ్యామ్ రోడ్ల పైలాన్‌ను ఆవిష్కరించడంతో పాటు నూతన జిల్లా కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించారు. ములుగు జిల్లాలో సుమారు రూ. 868 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ.. గడచిన బీఆర్ఎస్ హయాంలో మేడారం వనదేవతలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. రామప్ప దేవాలయంతో సమానంగా సమ్మక్క, సారలమ్మ దేవయాలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో తాను పీసీసీ అధ్యక్షుడిగా ములుగు నుంచే పాదయాత్ర ప్రారంభించానని, సమ్మక్క-సారలమ్మల ఆశీస్సులతోనే అధికారంలోకి వచ్చామని గుర్తుచేశారు. ములుగు ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నామని, మల్లూరు నరసింహస్వామి ఆలయాభివృద్ధికి త్వరలోనే ప్రత్యేక నిధులు మంజూరు చేస్తామని, అలాగే జంపన్న వాగును నూటికి నూరు శాతం అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కొందరు రాజకీయ నేతల తీరుపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. రక్తం పంచుకు పుట్టకపోయినా తాము మంత్రి సీతక్కను సొంత ఆడబిడ్డలా చూసుకుంటున్నామని తెలిపారు. కానీ కొందరు ఆస్తిలో భాగం ఇవ్వాల్సి వస్తుందనే దురాశతో సొంత చెల్లినే ఇంటి నుంచి బయటకు నెట్టేశారని విమర్శించారు. సొంత చెల్లికే న్యాయం చేయని వారు రాష్ట్రంలోని కోట్లాది మంది ఆడబిడ్డలకు ఏం న్యాయం చేస్తారని ప్రశ్నించారు. కొడుకు తప్పు చేస్తుంటే మందలించాల్సిన తండ్రి ఫాంహౌస్‌లో పడుకున్నారని, సొంత బిడ్డను వెళ్లగొడుతుంటే మౌనంగా ఉన్నారని ఎద్దేవా చేశారు. కుమారుడు చేసిన నేరంలో తండ్రికి కూడా సగభాగం ఉన్నట్లేనని, అలాంటి తండ్రీకుమారులు రాష్ట్రానికి పట్టిన శనీశ్వరులని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మరోవైపు ప్రజలు ఇబ్బందులు పడాలని కొందరు క్షుద్ర పూజలు చేయించారని విమర్శించారు. ఏదేమైనా దేవుడి దయతో వర్షాలు కురిశాయని, ప్రజలకు ఎలాంటి కష్టం రాకుండా ప్రభుత్వం అన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

## రష్యా ఖేల్ ఖతం.. 1000 కుపైగా డ్రోన్ లతో విధ్వంసం

ఉక్రెయిన్ నుంచి రష్యా పై జరిగిన అతిపెద్ద దాడుల్లో ఇది ఒకటి అని స్పష్టం చేసింది. ఈ దాడిలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించింది. ఉక్రెయిన్ నుంచి డ్రోన్ దాడులు ప్రారంభమైన నేపథ్యంలో రష్యా కూడా ప్రతీకార దాడులు చేపట్టింది. ఇక ఉక్రెయిన్ రష్యాలోని అనేక కీలక ప్రాంతాలపై భీకర దాడులు నిర్వహించింది. రష్యాలోని వేర్ హౌజ్ లు, ఇండస్ట్రీయల్ ప్లాంట్స్, రిఫైనరీలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ విషయాన్ని రష్యాకు చెందిన టీఏఎస్ఎస్ న్యూస్ ధ్రువీకరించింది. ఉక్రెయిన్ నుంచి ఈ రేంజ్ లో డ్రోన్ దాడులు జరగడం ఈ సంవత్సరంలో ఇదే తొలిసారి అని టీఏఎస్ఎస్ న్యూస్ వెల్లడించింది. ఈ మేరకు రష్యా రాజధాని మాస్కోలో డ్రోన్ దాడులు తీవ్రతరం అయ్యాయి. ఎయిర్ డిఫెన్స్ ఫోర్సెస్ అండ్ ఎలక్ట్రానిక్ వార్ ఫేర్ యూనిట్స్ కలిసి మాస్కో ప్రాంతంలో దాదాపు 187 డ్రోన్ లను కూల్చివేశాయి. ఈ విషయాన్ని మాస్కో గవర్నర్ ఆండ్రీ ఓరోబీవ్ స్పష్టం చేశారు. అయితే మాస్కోలో జరిగిన భీకర దాడుల్లో ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లలేదని పేర్కొన్నారు. మరోవైపు గత ఐదేళ్లలో ఉక్రెయిన్.. మాస్కోపై చేసిన అతిపెద్ద వైమానిక దాడుల్లో ఇదొకటని రష్యా మీడియా కథనాలు స్పష్టం చేశాయి. ఇరు దేశాల మధ్య జరిగిన దాడుల్లో అనేక నివాస గృహాలు, దుకాణాలు మంటల్లో చిక్కుకున్నట్లు సమాచారం. ఇక బ్లాక్ సీ నౌకాదళానికి ప్రధాన స్థావరంగా ఉన్న పోర్టుపై జరిగిన దాడిలో నాలుగు రష్యా యుద్ధనౌకలు దెబ్బతిన్నాయని ఉక్రెయిన్ సైన్యం ప్రకటించింది. వాటిలో రెండు ఫ్రిగేట్లు ఉన్నాయని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో రష్యా- ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు మరింత తీవ్రరూపం దాల్చాయి. ఇరు దేశాల మధ్య ఆందోళన పరిస్థితులు నెలకొన్నాయి.

## ప్రధాని నరేంద్ర మోదీకి మంత్రి పొన్నం లేఖ

ప్రతి కులం, సముదాయానికి డిజిటల్ కోడ్‌లు ఇవ్వాలి. స్థానిక, వివాదాస్పద కులపేర్ల నమోదుకు ప్రత్యేక ధృవీకరణ విధానం ఉండాలి. వ్యక్తి స్వయంగా ప్రకటించిన కులం, అధికారిక వర్గీకరణ రెండింటినీ డేటాలో భద్రపరచాలి. తెలంగాణ ౹ాజుజుౚజ సర్వే అనుభవాలను 2027 జనాభా లెక్కల రూపకల్పనలో పరిగణనలోకి తీసుకోవాలి' అని లేఖలో పేర్కొన్నారు.

## కేసీఆర్ పాలనకు మీ పిల్లలే రిపోర్టు కార్డు ఇస్తున్నారు

ఈ మేరకు బండి సంజయ్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. కేసీఆర్ హయాంలో ఇంటర్మీడియట్ విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఎందుకు వచ్చింది? అని ప్రశ్నల వర్షం కురిపించారు. సరిపడా ఉపాధ్యాయులను ఎందుకు నియమించలేదు? అని నిలదీశారు.యూనివర్సిటీల్లో ఖాళీ పోస్టులు ఎందుకు పేరుకుపోయేలా చేశారు? అని అడిగారు. బీఆర్ఎస్ హయాంలో ఎన్ని పేపర్ లీక్‌లు జరిగాయి? అని ప్రశ్నించారు.

### మీ సొంత పిల్లలే ఇప్పుడు సమస్యలను ఎత్తిచూపుతున్నారు..

కాలేజీలకు నిధులు ఎందుకు ఇవ్వలేదు?, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను సకాలంలో ఎందుకు చెల్లించలేకపోయారు? అని బండి సంజయ్ ప్రశ్నించారు. 'అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యమాల్లో పాల్గొన్న యూనివర్సిటీ విద్యార్థులకు కనీస గౌరవం అయినా ఇచ్చారా?. బీఆర్ఎస్ పాలనకు ఇప్పుడు కేసీఆర్ కుటుంబం నుంచే రిపోర్ట్ కార్డు వస్తోంది. మొదట ఆయన మనవడు పాఠశాలలు బాగోలేవని చెబుతున్నాడు. ఇప్పుడు ఆయన మనవరాలు కాలేజీలు కూడా బాగోలేవని చెబుతోంది. పదేళ్లు అధికారంలో ఉండి, మీరు పరిష్కరించలేకపోయిన సమస్యలను మీ సొంత పిల్లలే ఇప్పుడు ఎత్తిచూపుతున్నారు. మీ రాజకీయ ప్రత్యర్థుల పిల్లలు కాలేజీల్లో ఏం చేస్తున్నారో గమనించడం, మా ఫోన్లను ట్యాప్ చేయడంపై దృష్టి పెట్టడం బదులు, మీ సొంత పిల్లలు చెబుతున్న విషయాలను మీరు వినాల్సింది. ఇక మరో అద్భుతమైన మాట: భారత్ కంటే శ్రీలంక గొప్పదట!. లంకను చూసి భారత్ కంటే గొప్పదని చెప్పేది రావణాసురుడే. రామభక్తులు ఎప్పటికీ తమ మాతృభూమి గురించి ఇంత అవమానకరంగా మాట్లాడరు' అని బండి సంజయ్ అన్నారు.

### నాకు ఎల్లప్పుడూ నేషనే ఫస్ట్..

'భారత్‌లో అధికారాన్ని కోరుకుంటారని, ఇక్కడి ప్రజాధనంపై నియంత్రణ కావాలని కోరుకుంటారు. కానీ దేశాన్ని ప్రశంసించే విషయానికి వచ్చేసరికి, ఇతర దేశాలన్నీ గొప్పగా కనిపిస్తాయి.

## పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్నే నిర్వీర్యం చేసే ప్రయత్నం' విపక్షాల తీరుపై హరివంశ్ ఆగ్రహం

ఢిల్లీ : పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో జరిగిన గందరగోళం, నినాదాలు, వాయిదాలపై రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సభా కార్యకలాపాలను పదేపదే అడ్డుకోవడం వల్ల పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. విపక్షాల నిరసనలు కేవలం సభా కార్యక్రమాలను అడ్డుకోవడానికే పరిమితం కాకుండా, పార్లమెంటరీ వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీసే స్థాయికి చేరాయని వ్యాఖ్యానించారు. ఏఎన్ ఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో హరివంశ్ పలు అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. "ఇలాంటి పరిణామాలు పార్లమెంటరీ ప్రజాస్వామ్య విశ్వసనీయతను దెబ్బతీసే ప్రయత్నంగా కనిపిస్తున్నాయి. వ్యవస్థను అసమర్థంగా, విశ్వసనీయత లేనిదిగా చూపించి, ప్రజల్లో తమ ఎన్నికైన ప్రతినిధులపై అనుమానాలు కలిగించే పరిస్థితి ఏర్పడుతోంది. ఇది పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నంగా పరిణామాలను చూడాల్సి వస్తోంది.

## టీజీపీఎస్సీ కీలక ప్రకటన.. వచ్చే వారం నుంచి ఉద్యోగ నోటిఫికేషన్ల జాతర!

### మొదటి పేజి తరువాయి

చిన్న పొరపాటు జరిగినా వేలాది మంది అభ్యర్థుల భవిష్యత్తుపై ప్రభావం పడుతుందని, అందుకే ప్రతి దశలోనూ అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తామని తెలిపారు. ప్రశ్నాపత్రాల రూపకల్పన నుంచి మూల్యాంకనం వరకు అన్ని ప్రక్రియల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, పొరపాట్లకు తావులేని వ్యవస్థను రూపొందిస్తున్నట్లు వివరించారు. ఇదే సమయంలో సంగారెడ్డిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన




మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సుమారు 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని గుర్తుచేశారు. ఇటీవల మరో 10 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఏర్పడే ఖాళీలను గుర్తించి, ప్రతీ ఆరు నెలలకు ఒకసారి నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు నిర్వహించేలా పటిష్టమైన విధానాన్ని తీసుకొస్తామని ప్రకటించారు. ఉద్యోగాల భర్తీ బాధ్యత ప్రభుత్వానిదేనని, నిరుద్యోగ యువత ఎలాంటి వదంతులను నమ్మకుండా పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. టీజీపీఎస్సీ, ప్రభుత్వం నుంచి వచ్చిన ఈ స్పష్టమైన హామీలతో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో ఉత్సాహం నెలకొంది.

## చంద్రగిరిలో ఏనుగుల బీభత్సం.. రంగంలోకి దిగిన పవన్ కల్యాణ్

### మొదటి పేజి తరువాయి

క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై ఆయన అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి కీలక దిశానిర్దేశం చేశారు. ఏనుగుల కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని, ఇందుకోసం ఆధునిక టెక్నాలజీని వినియోగించుకోవాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. డ్రోన్ల సహాయంతో ఏనుగుల సంచార మార్గాలను గుర్తించి, ఆ సమాచారాన్ని ఎప్పటికప్పుడు సమీప గ్రామాల ప్రజలకు చేరవేయాలని సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు అటవీ, రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా అటవీ సరిహద్దు గ్రామాల్లో రాత్రివేళల్లో ప్రత్యేక గస్తీ బృందాలను ఏర్పాటు చేసి, ప్రజలు పొలాల వద్దకు వెళ్లకుండా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. స్థానిక సమాచార వ్యవస్థలు, మైకులు, మొబైల్ సందేశాల ద్వారా ప్రజలను నిరంతరం అప్రమత్తం చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ, "ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడం మన ప్రథమ కర్తవ్యం. ఏనుగుల వల్ల ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి. క్షేత్రస్థాయి సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా ఉంటూ పరిస్థితిని సమీక్షించాలి. అవసరమైతే, ప్రజల భద్రత కోసం ప్రత్యేకంగా శిక్షణ పొందిన 'హనుమాన్' బృందాలను సమస్యాత్మక ప్రాంతాల్లో మోహరించాలి" అని అధికారులకు స్పష్టం చేశారు. ఏనుగుల దాడుల్లో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. పంట నష్టంపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు రూపొందించిన వెంటనే, అటవీశాఖ నిబంధనల ప్రకారం బాధితులకు తక్షణమే పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలు కూడా భయాందోళనలకు



గురికాకుండా, ధైర్యంగా ఉంటూ అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని, ఏనుగులు కనిపించిన వెంటనే అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉప ముఖ్యమంత్రి

## మోదీ అజెండా తనను తాను కాపాడుకోవడమే- మహిళా రిజర్వేషన్లు కాదు

### మొదటి పేజి తరువాయి



ప్రధాని మోదీ ఎర్రకోట నుంచి నీతులు చెప్పడం మానేసి 2029 ఎన్నికల్లో ప్రస్తుత లోక్‌సభ సభ్యుల సంఖ్య ఆధారంగానే మహిళా రిజర్వేషన్ కోటాను అమలు చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు మీడియా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. "1993లో 73, 74వ రాజ్యాంగ సవరణ బిల్లులు ఆమోదం పొందాయి. తద్వారా పంచాయతీలు, జిల్లా పరిషత్‌లు, బ్లాక్ పంచాయతీలు, మున్సిపాలిటీలలో మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్లు దక్కాయి. రాజీవ్ గాంధీ మహిళా రిజర్వేషన్ల కోసం కృషి చేశారు. రాజ్యాంగంలో ఈ నిబంధనలను తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. 2023 సెప్టెంబర్‌లో పార్లమెంట్‌లో 'నారీ శక్తి వందన్ అధినియం-2023' బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే గట్టిగా డిమాండ్ చేశారు. లోక్‌సభలోని 543 మంది సభ్యుల సంఖ్య ఆధారంగా మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలు పదేపదే కోరుతున్నాయి. ఈ లెక్కన నారీమణులకు 182 సీట్లు కేటాయించాల్సి ఉంటుంది. ఎర్రకోట నుంచి పదేపదే నీతులు బోధించడం, నాటకాలు ఆడడం ప్రధాని మోదీ మానుకోవాలి. 2029లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రస్తుత లోక్‌సభ ఎంపీల సంఖ్య ఆధారంగా మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలి."

**--జైరాం రమేశ్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి**

'మూడింట రెండొంతుల మెజారిటీ- భవిష్యత్తులో కూడా రాదు'

మహిళా రిజర్వేషన్‌ను డీలిమిటేషన్‌తో ముడిపెట్టడానికే మోదీ ప్రభుత్వం ఆసక్తి చూపిస్తోందని జైరాం రమేశ్ ఆరోపించారు. వర్షాకాల సమావేశాల్లో కూడా డీలిమిటేషన్‌తో కూడిన రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టలేకపోయిందని విమర్శించారు. మోదీ ప్రభుత్వానికి మూడింట రెండొంతుల మెజారిటీ లేదని, భవిష్యత్తులో కూడా అది రాదని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

### రాహుల్ విమర్శలను సమర్థించిన జైరాం

నరేంద్ర మోదీ దౌత్యంపై లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ చేసిన విమర్శలను జైరాం రమేశ్ సమర్థించారు. "నేను దీనిని అవమానంగా చూడను. ఇప్పుడు దౌత్యం ఎక్కడ ఉంది? ఇప్పుడు హగ్లోమసీ (అందరినీ కౌగిలించుకోవడం) ఉంది. విదేశీ నాయకులు మోదీకి మంచి స్నేహితులని చూపించడం, చిన్న దేశాలను అవార్డులు, పతకాలు ఇవ్వమని అడుగుతారు. ఇది మన విదేశాంగ విధానానికి మంచిది కాదు. ఇది దేశాన్ని బలహీనపర్చింది. ఇక వ్యక్తులను అప్రతిష్టపాల్జేసే విషయంలో ప్రధానికి ఎవరూ సాటి లేరు. ప్రధానిని ఎవరైనా ప్రశ్నించినా లేదా విమర్శించినా ఆయన బాధితుడిగా మారి రాజకీయాలు చేస్తారు. ఆయన ఇతరులను ప్రశ్నిస్తారు. జోకులు వేస్తారు. అవమానకరమైన మాటలు ఉపయోగిస్తారు. కానీ ఎవరైనా ఆయన్ని ప్రశ్నిస్తే మాత్రం ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తారు" అని జైరాం రమేశ్ పేర్కొన్నారు.

### 'మోదీని ప్రశ్నిస్తే వారిపై ఏదో ఒక ముద్ర వేస్తారు'

పంద్రాగస్టు సందర్భంగా ఎర్రకోట వేదికగా ప్రధాని మోదీ చేసిన దిమాగీ నక్సల్స్ వ్యాఖ్యలపై జైరాం రమేశ్ మండిపడ్డారు. మోదీని వ్యతిరేకించే వారిని 'దిమాగీ నక్సల్' అని పిలుస్తారని ఎద్దేవా చేశారు. ఈ దిమాగీ నక్సల్స్ కుల గణన జరగాలని డిమాండ్ చేశారని గుర్తు చేశారు. నాలుగేళ్లుగా కులగణన జరగదని మోదీ చెబుతూ వచ్చారని, ఆ తర్వాత 2025 ఏప్రిల్ 30న కుల గణన జరుగుతుందని ప్రకటించారని అన్నారు. మోదీని ప్రశ్నించే ఎవరికైనా ఏదో ఒక ముద్ర వేస్తారని ఆరోపించారు. సామాజిక న్యాయం కోరిన వారు దిమాగీ నక్సల్ అవుతారా? అని ప్రశ్నించారు. పార్లమెంట్ పనితీరుకు ప్రతిపక్షాలు ఆటంకం కలిగించాయన్న ఆరోపణలపై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ స్పందించారు. "విద్యార్థుల నిరసనల సమయంలో ఢిల్లీ పోలీసుల వ్యవహారంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా సభకు వచ్చి ప్రకటన చేయాలని మేము కోరాం. జులై 20న విద్యార్థులు, యువతపై జరిగిన అకృత్యాలపై షా సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశాం. పార్లమెంట్ వేదికగా ఈ అంశంపై చర్చ జరగాలని కోరాం. ప్రధాని మోదీ విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాం. అయోధ్య విరాళాలు చోరీపై చర్చ జరగాలని కోరాం. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా సభకు హాజరుకాకపోవడం తీవ్రమైన విషయం. సభను నడపాల్సిన ప్రాథమిక బాధ్యత ప్రభుత్వంపైనే ఉంది" అని జైరాం రమేశ్ వివరణ ఇచ్చారు.

## నేటి అర్ధరాత్రితో విశాఖకు విమానాల రాకపోకలు బంద్

### మొదటి పేజి తరువాయి

అంతలా వారికి దానితో అనుబంధం పెనవేసుకుపోయింది. 1941లో రెండో ప్రపంచ యుద్ధ సమయంలో విశాఖ ఎయిర్ పోర్ట్ కి పునాది పడింది. రాయల్ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అవసరాల కోసం బ్రిటిష్ పాలకులు ఈ ఎయిర్ ఫీల్డ్ నిర్మించారు. 'వింటేజ్ ఆర్కిటెక్' ముప్పిడి కుటుంబానికి రన్ వే నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. 45 రోజుల్లో పూర్తి చేయాలని లక్ష్యం నిర్దేశించారు. ఎత్తైన గుట్టలతో నిండిన ప్రాంతాన్ని వేగంగా చదును చేసి అనుకున్న సమయానికంటే ముందే రన్‌వే నిర్మించి ఇచ్చారు. తొలి పౌర విమాన రాకపోకలు (సివిల్ ఆపరేషన్స్) 1954లో ప్రారంభం కాగా నాడు రాకపోకలకు చాలా తక్కువగా అనుమతులిచ్చారు. పూర్తిస్థాయి వాణిజ్య విమాన సర్వీసులు 1981లో మొదలయ్యాయి. అప్పటి నుంచి పూర్తి సివిల్ ఎయిర్‌పోర్టుగా ఆపరేషన్స్ ప్రారంభమయ్యాయి. వ్యూహాత్మక భద్రతా కారణాలతో 1986లో భారత నావికాదళం చేతిలోకి ఈ ఎయిర్ పోర్ట్ వెళ్లింది. 1991లో దీనికి 'ఐఎన్ఎస్ డేగ' అని నామకరణం చేశారు. అప్పటి నుంచి నేవీ నియంత్రణలో ఉంటూ పౌర విమాన సర్వీసులు నడుపుతున్నారు. పాత రన్‌వే కేవలం ఆరు వేల అడుగులు మాత్రమే ఉండటంతో పెద్ద విమానాల ల్యాండింగ్‌కు ఇబ్బందులు ఎదురయ్యేవి. దీన్ని అధిగమించడానికి 10,007 అడుగుల రన్‌వేను నిర్మించి 2007 జూన్ 15న ప్రారంభించారు. దీంతో బోయింగ్ 737, ఎయిర్‌బస్ ఏ320 వంటి భారీ వాణిజ్య విమానాల రాకపోకలకు మార్గం సుగమమైంది. రూ.95 కోట్లతో సరికొత్త ఇంటిగ్రేటెడ్ ప్యాసింజర్ టెర్మినల్ భవనాన్ని 2009 ఫిబ్రవరి 20న ప్రారంభించారు.



ఇన్‌స్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్ (ఐఎల్ఎస్) రాత్రివేళల్లో విమానాలు దిగే సాంకేతికత (నైట్ ల్యాండింగ్) 2012లో అందుబాటులోకి వచ్చింది. అదే సంవత్సరం ఎయిర్ ఇండియా సింగపూర్‌కు మొట్టమొదటి అంతర్జాతీయ సర్వీసు ప్రారంభించడంతో విశాఖ గ్లోబల్ ఏవియేషన్ మ్యాప్‌లో నిలిచింది. మరోవైపు విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సోమవారం (ఆగస్టు 17) నుంచి విమాన రాకపోకలు ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో విశాఖ ఎయిర్ పోర్ట్ నుంచి షెడ్యూల్ విమానాలను నిలిపేస్తున్నట్లు పౌరవిమానయానశాఖ ఇప్పటికే ప్రకటించింది. 30 సంవత్సరాల పాటు వైజాగ్ విమానాశ్రయం నుంచి (ఐఎన్ఎస్ డేగ) సివిల్ ఎన్‌క్లేవ్ నుంచి షెడ్యూల్డ్ కమర్షియల్ విమానాల రాకపోకలను నిలిపేస్తున్నట్లు పేర్కొంది. జాతీయ అత్యవసర పరిస్థితుల్లో ఈ నిబంధనకు మినహాయింపు ఉంటుందని తెలిపింది. భారతీయ వాయుసేన, సాయుధ దళాలు, పోలీసు విమానాలు, ప్రభుత్వ అతిథులు రాకపోకలు సాగించే విమానాలు, లీజ్, వీఐపీ ఎయిర్‌క్రాఫ్ట్‌లు ఇక్కడి నుంచి నడుస్తాయని పౌరవిమానయానశాఖ పేర్కొంది. నాన్‌షెడ్యూల్డ్ వాణిజ్య కార్యకలాపాలూ కొనసాగుతాయని తెలిపింది. ఇప్పటి వరకు విశాఖ విమానాశ్రయానికి ఉన్న అంతర్జాతీయ ట్రావెల్‌కోడ్ 'వీటీజెడ్' సోమవారం (ఆగస్టు 17) అర్ధరాత్రి 00:01 గంటల నుంచి అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయానికి బదిలీ అవుతుందని కేంద్రం వెల్లడించింది. తొలి విమానం దేశీయమే : వాస్తవానికి భోగాపురం ఎయిర్ పోర్ట్ నుంచి సింగపూర్‌కు తొలి విమానం ఇవాళ బయల్దేరుతుందని అనుకున్నారు. కానీ సోమవారం (ఆగస్టు 17)న ఉదయం సర్వీసులు ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే భోగాపురం నుంచి హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, తిరుపతికి ఇండిగో సంస్థ తొలి రోజు 31 సర్వీసులు నడపడానికి ప్రణాళిక రూపొందించింది. భోగాపురం విమానాశ్రయం నుంచి రాకపోకలపై విమానయాన సంస్థలు ఒక్కొక్కటిగా తమ షెడ్యూళ్లను విడుదల చేస్తున్నాయి. మరోవైపు నేటి అర్ధరాత్రి నుంచి విశాఖ ఎయిర్‌పోర్ట్ సేవలు రద్దు కానుండగా అక్కడి నుంచి సేవలందించే విమానాలన్నీ భోగాపురం నుంచి వెళ్లనున్నాయి. బయల్దేరే సర్వీసులివే : భోగాపురం నుంచి హైదరాబాద్‌కు సోమవారం(ఆగస్టు 17)న ఉదయం 8.55, 10.40, మధ్యాహ్నం ఒంటిగంట, సాయంత్రం 4.25, రాత్రి 7.20, 8.40, 9.20 గంటలకు బయల్దేరనున్నాయి. ఢిల్లీకి ఉదయం 8.20, రాత్రి 10.45, బెంగళూరుకు మధ్యాహ్నం 2.55, రాత్రి 9.10, చెన్నైకి మధ్యాహ్నం 12.15, సాయంత్రం 6.35, కోల్‌కతాకు రాత్రి 7.50, ముంబయికి మధ్యాహ్నం 3.05, తిరుపతికి మధ్యాహ్నం 1.50 గంటలకు విమానాలు ప్రారంభమవుతాయని పేర్కొంది.

## వందేమాతరం గేయాన్ని కాంగ్రెస్ అవమానించింది- వారికి క్షమాపణలు చెప్పాలి'

### మొదటి పేజి తరువాయి

జైలు పాలయ్యారని అమిత్ షా గుర్తు చేశారు. ఓటుబ్యాంకు రాజకీయాల కోసమే హస్తం పార్టీ వందేమాతరం గేయాన్ని మరిచిపోయిందని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు గడిచిన తర్వాత ఎర్రకోటతో పాటు జెండా ఆవిష్కరణ జరిగిన అన్ని చోట్లా వందేమాతరం ఆలపించారని తెలిపారు. "సోనియా జీ, 140 కోట్ల మంది ప్రజలు మిమ్మల్ని గమనిస్తున్నారు. మీరు చేసిన ఈ పాపాన్ని దేశ ప్రజలు ఎప్పటికీ క్షమించరు. 'వందేమాతరం' గేయాన్ని అసంపూర్ణంగా వదిలేయాలని ఎవరైనా ఎలా ఆలోచించగలరు? కాంగ్రెస్ పార్టీ దీనికి సిగ్గుపడాలి" అని అన్నారు. మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయీ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన 'అటల్ గౌరవ్ స్మృతి సమారోహ్'లో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన 21 అడుగుల ఎత్తైన విగ్రహాన్ని ఆవిష్కరించారు. పోఖ్రాన్ పరీక్షల తర్వాత అంతర్జాతీయ ఒత్తిడి ఉన్నప్పటికీ, భారతదేశాన్ని అణు శక్తిగా మార్చడంతో సహా వాజ్‌పేయీ అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు. వాజ్‌పేయి ప్రభుత్వం తన హయాంలో గ్రామాలను రోడ్లతో అనుసంధానించిందని, జాతీయ



రహదారులను నిర్మించిందని గుర్తుచేశారు. గిరిజన అభివృద్ధి కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసిన ఘనత కూడా వాజ్‌పేయిదేనని ఆయన కొనియాడారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గిరిజన సంక్షేమానికి నిరంతరం ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొన్నారు.

### సోనియా గాంధీపై బీజేపీ నేతల ఫిర్యాదు

మరోవైపు ఈ వివాదం నేపథ్యంలో కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీపై భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నాయకులు ఆదివారం కర్ణాటకలోని ఉర్వా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ప్రవర్తన జాతీయ గేయాన్ని అగౌరవపరచడమేనని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు విమర్శించారు. ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ నాయకత్వం జాతీయ గేయం 'వందేమాతరం' పట్ల తీవ్రమైన అగౌరవాన్ని కలిగి ఉందని ఆరోపించారు. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం జరిగిన స్వాతంత్ర్య దినోత్సవాలపై దుమారం రేగింది. జెండావందనం సందర్భంగా వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించకుండా ఆ పార్టీ అగ్రనేత సోనియాగాంధీ మధ్యలోనే అడ్డుకున్నారని బీజేపీ ఆరోపించింది. ఇందుకు సంబంధించిన వీడియో దృశ్యాన్ని పార్టీ ప్రధాన కార్యదర్శి బి.ఎల్.సంతోష్ సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. తల్లి, తనయుడు, ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు పూర్తి వందేమాతరాన్ని ఆలపించడానికి ఇష్టపడుతున్నట్లు లేదని, కొందరి ఆలోచనాధోరణి 1947కి పూర్వం ఎలా ఉందో ఆ తర్వాతా అలాగే ఉందని విమర్శించారు. వందేమాతరం పూర్తి గేయాన్ని ఎందుకు వేశారంటూ కార్యకర్తల్ని సోనియా ప్రశ్నించారని, అది ఎంతో సిగ్గుచేటు అని బీజేపీ అధికార ప్రతినిధి గోపాలకృష్ణ అగర్వాల్ మండిపడ్డారు. అయితే, బీజేపీ విమర్శలకు కాంగ్రెస్ వివరణ ఇచ్చింది. వివాదమేమీ లేదని కొట్టిపారేసింది.

ప్రజా న్యూస్ నెట్ వర్క్ దినపత్రిక

సోమవారం 17-08-2026

# పేద ప్రజలకు వైద్య సేవలు అందించడమే నా ఏకైక లక్ష్యం.. బొంగునూరి కిషోర్ రెడ్డి



**కుత్బుల్లాపూర్ ఆగస్టు 16 ప్రజా న్యూస్ నెట్వర్క్ :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 296 దుండిగల్ తాండా 2 – డివిజన్లో బి కే ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 56 వ ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రోటోకాల్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బి కే ఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు బొంగునూరి కిషోర్ రెడ్డి ముఖ్య అతిథులుగా ఈ సందర్భంగా కిషోర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరాలను నిరంతరం నిర్వహిస్తున్నామని తెలిపారు. దుండిగల్ తండా 2 పరిసర ప్రాంతాల ప్రజలు ఈ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో రాజేష్ నాయక్, నర్సింహారెడ్డి, గణేష్ నాయక్, ఆకాష్, కృష్ణ, మహేష్, సందీప్, రిజ్వాన్, టీమ్ బికెఆర్ సభ్యులు స్థానిక ప్రజలు మరియు నిర్వాహకులు పాల్గొన్నారు.

# యువత సేవా స్ఫూర్తికి ప్రతీకగా రక్తదాన శిబిరం..




**విశాఖపట్నం ఆగష్టు15: ప్రజాన్యూస్, విశాఖపట్నం, స్టాఫ్ రిపోర్టర్, పీ.ఎం.నాయుడు.** టీ.ఎస్.ఆర్. హాస్పిటల్ ఎం.డి. రాజేష్, డాక్టర్ రోజాదేవి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. పారిశ్రామిక ప్రాంతంలో నిర్వహించిన ఈ శిబిరానికి యువత నుంచి విశేష స్పందన లభించింది.ఈ రక్తదాన శిబిరంలో సుమారు 100 మంది యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చని, యువతలో సేవాభావాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాపురం సీఐ హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం రక్తదానం చేసిన యువకులకు గాజువాక వైఎస్సార్సీపీ ఇన్‌చార్జి తిప్పల దేవన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా రక్తదానం చేసిన యువతను అతిథులు, నిర్వాహకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో లీడర్, రిపోర్టర్ మనోహర్, ఎం.ఉదయ్ కుమార్, పెద్దాడ సంతోష్, పాల్గొన్నారు.

# సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ మార్గం ఏర్పాటు చేయాలి

## మూడో రోజుకు చేరిన నిరాహార దీక్షకు ముస్లిం మైనార్టీ నాయకుల సంఘీభావం




**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 16,ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :** సూర్యాపేట పట్టణానికి బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని ఏర్పాటు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో చేపట్టిన నిరాహార దీక్ష ఆదివారం మూడో రోజుకు చేరుకుంది. సూర్యాపేట ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్షగా ఉన్న బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని సూర్యాపేట మీదుగా ఏర్పాటు చేయాలని కోరుతూ కొనసాగుతున్న దీక్షకు వివిధ వర్గాల నుంచి మద్దతు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో సూర్యాపేటకు చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు, న్యాయవాది ఎండీ ఖాలిద్ అహ్మద్ ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీ నాయకులు దీక్షా శిబిరానికి చేరుకుని దీక్ష చేస్తున్న వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ మార్గం ఏర్పాటు చేయడం ద్వారా జిల్లా కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు గణనీయంగా మెరుగుపడే అవకాశం ఉందన్నారు. వేగవంతమైన రవాణా వ్యవస్థ అందుబాటులోకి వస్తే విద్య, వైద్యం, వ్యాపారం, పరిశ్రమలు, ఉపాధి, పర్యాటకం తదితర రంగాలకు మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. సూర్యాపేట ప్రాంతం భవిష్యత్‌లో మరింత వేగంగా అభివృద్ధి చెందేందుకు బుల్లెట్ ట్రైన్ వంటి ఆధునిక రవాణా సదుపాయాలు ఎంతో అవసరమని వారు తెలిపారు. సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని ఏర్పాటు చేయడం వల్ల స్థానిక ప్రజలకు మాత్రమే కాకుండా ఉమ్మడి జిల్లాలోని అనేక ప్రాంతాల ప్రజలకు కూడా ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ప్రజల ఆకాంక్షను, ప్రాంతీయ అవసరాలను పరిగణనలోకి తీసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ డిమాండ్‌పై సానుకూలంగా స్పందించి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. కేవలం రవాణా సౌకర్యం కోసమే కాకుండా సూర్యాపేటను భవిష్యత్‌లో మరింత అభివృద్ధి చెందిన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు బుల్లెట్ ట్రైన్ మార్గం కీలకంగా మారుతుందని పేర్కొన్నారు. దీక్షా శిబిరంలో పలువురు ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొని తమ మద్దతును ప్రకటించారు. ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకునే వరకు ఉద్యమాన్ని మరింత విస్తృతంగా కొనసాగించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఎండీ కలీముద్దీన్, ఎస్‌కే సాజిద్, ముఫ్తీ అస్రార్, హాఫిజ్ ఆసిఫ్, హాఫిజ్ జావిద్, హాఫిజ్ రౌఫ్, మౌలానా యూనుస్, హాఫిజ్ రహ్మాన్, హాఫిజ్ సమీఉర్ రహ్మాన్, హాఫిజ్ బాసిత్, జమాల్ మునీర్, కాంగ్రెస్ నాయకుడు ఎండీ అయ్యూబ్ ఖాన్ తదితరులు పాల్గొని దీక్షకు సంఘీభావం తెలిపారు.

# చింతంనీడి అబ్బాయి జన్మదిన వేడుకలకు రైతు సేవే కానుక






**తుని, ఆగస్టు 16 ప్రజా న్యూస్ నెట్వర్క్:** తుని మండల టీడీపీ అధ్యక్షుడు చింతంనీడి అబ్బాయి జన్మదినాన్ని పురస్కరించుకుని ఎన్. సూరవరం పంచాయతీలో 650 మంది రైతులకు ఒక్కొక్కరికి ఒక యూరియా బస్తా చొప్పున ఉచితంగా పంపిణీ చేశారు. మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యే యనమల దివ్య ఆశీస్సులతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జన్మదిన వేడుకల ఖర్చును రైతుల సంక్షేమానికి వినియోగించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అండగా నిలిచిన ఈ సేవా కార్యక్రమాన్ని రైతులు, స్థానికులు అభినందించారు. కార్యక్రమంలో చింతంనీడి కుటుంబ సభ్యులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 40 పేద కుటుంబాలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

## అర్హులకు ఇళ్లు కల్పించిన తర్వాతే ఖాళీ చేయించాలి: సీపీఐ మండల కార్యదర్శి వెలుగుల అర్జునరావు



**పాయకరావుపేట ఆగస్టు 16 ప్రజా న్యూస్ నెట్వర్క్:** పాయకరావుపేట బస్టాండ్ వెనుకనున్న అరటి కాయల మార్కెట్ ప్రాంతంలో గత 40 సంవత్సరాలుగా 40 పేద కుటుంబాలు పాకలు నిర్మించుకొని నివాసం ఉంటున్నాయని సీపీఐ మండల కార్యదర్శి వెలుగుల అర్జునరావు తెలిపారు. గతంలో వీరిలో 16 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించగా, ఏడుగురు పునాదులు నిర్మించుకున్నారని, వారిలో ఇద్దరు మాత్రమే ఇళ్లు నిర్మించుకొని నివసిస్తున్నారని పేర్కొన్నారు. పునాదులు వేసుకున్న వారికి ఇళ్లు నిర్మించుకునే ఆర్థిక స్థోమత కూడా లేదన్నారు. మరో ఏడుగురికి తమ స్థలాలు ఎక్కడ ఉన్నాయో కూడా తెలియని పరిస్థితి ఉందని తెలిపారు. మిగిలిన 24 కుటుంబాలకు కనీసం నివాసం ఉండేందుకు ఇళ్లు కూడా లేవని, అదే ప్రాంతంలో వారు జీవనం సాగిస్తున్నారని అర్జునరావు పేర్కొన్నారు. ఈ కుటుంబాల్లో రిక్షా కార్మికులు, చెత్త కాగితాలు ఏరుకునేవారు, ఇళ్లల్లో పనులు చేసుకునేవారు, ఎలాంటి ఆధారం లేని నిరాశ్రయులు ఉన్నారని తెలిపారు. ముందస్తు చర్యలు తీసుకోకుండా అకస్మాత్తుగా వచ్చి ప్రాంతాన్ని ఖాళీ చేయాలని చెప్పడం సరికాదని ఆయన పేర్కొన్నారు. సంబంధిత కుటుంబాలపై సమగ్ర విచారణ జరిపి, అర్హులైన 24 కుటుంబాలకు పక్కా ఇళ్లు నిర్మించి ఇచ్చిన తర్వాతే ప్రాంతాన్ని ఖాళీ చేయించాలని డిమాండ్ చేశారు. పేదల సమస్యల పరిష్కారానికి సీపీఐ పార్టీ అండగా ఉంటుందని సీపీఐ మండల కార్యదర్శి వెలుగుల అర్జునరావు తెలిపారు.

# స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ గౌతులచ్చన్న 117 వ జయంతి వేడుకలు..



**విశాఖపట్నం,ఆగస్టు 16: ప్రజా న్యూస్, విశాఖపట్నం స్టాపర్ రిపోర్టర్,పీ.ఎం నాయుడు.** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతల చిన్న 117వ జయంతి వేడుకలు బీసీ రోడ్ నడిపూరు సీకువానిపాలెంలో ఆదివారం గీత సహకులాల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా భారీ ఎత్తున నిర్వహించారు, ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర



తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మరియు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, డిసిసిబి చైర్మన్ కోన తాతారావు, మాజీ జీవీఎంసీ డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయ శాఖ, శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానం (జింక్),ఆలయ ధర్మకర్త, జనసేన పార్టీ 61 అధ్యక్షులు మరియు గీత సహకులాల సంక్షేమ సంఘం పారిశ్రామిక ప్రాంతం (గాజువాక ),ఎగ్జిక్యూటివ్ చైర్మన్ దుంగ దేవన్ రాజు పాల్గొన్నారు, దేవన్ రాజు మాట్లాడుతూ.. స్వతంత్ర సమరయోధుడు సర్దార్ గౌతలచ్చన్న విగ్రహానికి పూలమాలవేసి స్మరించుకున్నారు, ఆయన 16 ఆగస్టు 1909, బారువ , శ్రీకాకుళం జిల్లాలో జన్మించారు, స్వాతంత్ర సమరయోధుడిగా, జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా , రైతు ఉద్యమాలు నడిపిన ఉద్యమకారులుగా, రాజకీయ నాయకుడిగా , గౌతులచ్చన్న చిన్న వయసు నుంచి పోరాటాల ప్రారంభించారు, కులమతాలకి అతీతంగా పోరాడి హక్కులను సాధించారు, యువతీ యువకులు ఇలాంటి దేశభక్తి కలిగిన నాయకులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు, సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, సుమారుగా 5000 మందికి అన్నదాన, మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో గీత కులాల సంక్షేమ సంఘం అధ్యక్షులు, కార్యదర్శిలు, సభ్యులు , స్థానిక ప్రజలు , నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నాలుగో రోజుకు చేరిన ఆర్టిజన్ కాంట్రాక్ట్ ఉద్యోగుల ఆమరణ నిరాహార


## 15 ఏళ్లుగా సేవలందిస్తున్న తమను కొనసాగించాలని ఉద్యోగుల డిమాండ్



**సూర్యాపేట జిల్లా ఆగస్టు 16 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్ అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :** పులిచింతల జెన్‌కో వద్ద ఆన్‌ఫర్ ఆర్టిజన్ కాంట్రాక్ట్ ఉద్యోగులు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష నాలుగో రోజుకు చేరుకుంది. జెన్‌కో వద్ద దీక్ష నిర్వహించేందుకు అనుమతి నిరాకరించడంతో ఉద్యోగులు వజీనేపల్లి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద తమ ఆమరణ నిరాహార దీక్షను కొనసాగిస్తున్నారు. గత 15 ఏళ్లుగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తూ సంస్థకు సేవలందిస్తున్న తమను విధుల్లో కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు ఈ ఆందోళనకు దిగారు. ఎన్నో సంవత్సరాలుగా సంస్థలో పనిచేస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించిన తమ సేవలను గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరుతున్నారు. దీర్ఘకాలంగా కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్నప్పటికీ తమ భవిష్యత్తుపై స్పష్టత లేకపోవడం వల్ల కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను అధికారులు వెంటనే పరిశీలించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. మరోవైపు ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న ఉద్యోగుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు ఏఎన్ఎం పర్యవేక్షిస్తున్నారు. దీక్షా శిబిరం వద్ద ఉద్యోగుల రక్తపోటును పరీక్షించి ఆరోగ్య వివరాలను నమోదు చేస్తున్నారు. రోజులు గడుస్తున్న కొద్దీ ఉద్యోగుల ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి ఉద్యోగులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. తమ డిమాండ్లపై స్పష్టమైన నిర్ణయం తీసుకుని ఉద్యోగాల్లో కొనసాగించే వరకు ఆమరణ నిరాహార దీక్షను విరమించేది లేదని ఉద్యోగులు స్పష్టం చేశారు. తమ సమస్య పరిష్కారం కోసం శాంతియుతంగా కొనసాగిస్తున్న పోరాటానికి ప్రభుత్వం తక్షణమే స్పందించి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

# అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ కార్యకర్తలకు ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి ఆర్థిక భరోసా

## ఆపదలో ఉన్న కార్యకర్తలకు అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యే



**అనుముల మండలం ఆగస్టు 16 ప్రజా న్యూస్ నెట్వర్క్ :** నాగార్జున సాగర్ నియోజకవర్గంలోని అనుముల మండలం కొరివేని గూడెం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను స్థానిక ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. అనారోగ్యంతో పాటు అంగవైకల్యంతో బాధపడుతున్న సీత రాములుకు రూ.50,000 ఆర్థిక సహాయం అందజేశారు. కంటి సమస్యలతో బాధపడుతున్న సీత నాగరాజు, సీత మంగమ్మ, దైద లక్ష్మణ్‌లకు ఒక్కొక్కరికి రూ.15,000 చొప్పున ఆర్థిక సహాయం అందించారు. అదేవిధంగా పెరాలసిస్‌తో బాధపడుతున్న తక్కలపల్లి వెంకటయ్యకు రూ.5,000 ఆర్థిక సహాయం అందించి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా అనారోగ్యంతో బాధపడుతున్న కార్యకర్తల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలు ఆపదలో ఉన్న సమయంలో వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కార్యకర్తల సంక్షేమానికి ఎల్లప్పుడూ సహకారం అందిస్తామని తెలిపారు. తమను పరామర్శించి ఆర్థిక సహాయం అందించిన ఎమ్మెల్యేకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు, మండల నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి మండల స్థాయిలో ప్రజావాణి

## ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహణ




**సూర్యాపేట జిల్లా ఆగస్టు 16 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్. అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కోదాడ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నేటి నుంచి ప్రతి సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఇసాక్ హుస్సేన్ తెలిపారు. మండల పరిధిలోని ప్రజలు తమ సమస్యలు, వినతులు, ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అభ్యర్థనలు నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అధికారులకు నేరుగా తెలియజేసి పరిష్కారం పొందేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల స్థాయిలో పనిచేస్తున్న అన్ని శాఖల అధికారులు ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతులను స్వీకరించాలని ఎంపీడీవో ఆదేశించారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులు వాటిని పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రజలు తమ సమస్యలను ఒకే వేదికపై అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా ప్రజావాణి కార్యక్రమం ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలను అధికారులకు తెలియజేయాలని కోరారు.

# హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ప్రతి సోమవారం ప్రజావాణి

## ఏడు మండలాల్లో ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 16 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్.అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :**
హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని ప్రజల సమస్యలను నేరుగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి వాటికి పరిష్కారం చూపించే ఉద్దేశంతో ప్రతి సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని హుజూర్‌నగర్, గరిడేపల్లి, నేరేడుచర్ల, పాలకవీడు, మఠంపల్లి, మేళ్లచెరువు, చింతలపాలెం మండలాల్లో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం కొనసాగనుంది. ఆయా మండలాల మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించనున్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పదేపదే వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా ఒకే వేదికపై సంబంధిత అధికారులను కలిసి తమ సమస్యలను వివరించేందుకు ప్రజావాణి కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది. రెవెన్యూ శాఖకు సంబంధించిన భూ సమస్యలు, పట్టాదారు పాసుపుస్తకాలు, ధరణి, ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, ప్రభుత్వ భూములు, పింఛన్లు, రేషన్ కార్డులు వంటి సమస్యలతో పాటు గ్రామాల్లో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, డ్రైనేజీలు, రహదారులు, వీధి దీపాలు, విద్యుత్ సమస్యలు, వ్యవసాయానికి సంబంధించిన సమస్యలు, పంటలు, రైతుల ఇబ్బందులు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వైద్య సేవలు, సంక్షేమ పథకాలు, ఇళ్ల నిర్మాణం తదితర అంశాలను ప్రజలు ప్రజావాణిలో అధికారుల దృష్టికి తీసుకురావచ్చు. ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును సంబంధిత శాఖల అధికారులు స్వీకరించి సమస్య తీవ్రతను పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులు సూచించారు. ఒక శాఖకు సంబంధించిన సమస్య మరో శాఖతో సంబంధం కలిగి ఉంటే సంబంధిత అధికారులు పరస్పరం సమన్వయం చేసుకుని పరిష్కారం చూపాలని సూచిస్తున్నారు. ప్రజావాణి కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకోవడంతో పాటు ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం లేకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రజల నుంచి అందిన వినతులు కేవలం స్వీకరించడానికే పరిమితం కాకుండా వాటి పరిష్కారానికి కార్యాచరణ చేపట్టి ప్రజలకు అవసరమైన సమాచారం అందించేలా అధికారులు వ్యవహరించాల్సి ఉంటుంది. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి ద్వారా ప్రజలకు ప్రభుత్వ యంత్రాంగానికి మధ్య మరింత సమన్వయం ఏర్పడి స్థానిక సమస్యలు వేగంగా పరిష్కారమయ్యే అవకాశం ఉంది. తమ గ్రామాలు, మండలాల్లో నెలకొన్న సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చి ప్రజావాణి అవకాశాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని అధికారులు కోరుతున్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రజావాణి ప్రధాన లక్ష్యంగా ఉండడంతో అర్హత కలిగిన ప్రతి వ్యక్తి తన సమస్యకు సంబంధించిన వివరాలతో ప్రజావాణికి హాజరై వినతిని సమర్పించుకోవాలని సూచించారు.




# ఓటిటి బాటపట్టిన చెన్నై లవ్ స్టోరీ

కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరీ ప్రియ ప్రధానపాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'చెన్నై లవ్‌స్టోరీ' ఓటిటి బాట పట్టింది. రవి నంబూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి యూత్‌కు కనెక్ట్ అయింది. ఇప్పుడీ ప్రేమకథ ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. సోనీలివ్ వేదికగా ఆగస్టు 21 నుంచి స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతోపాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషల్లో అందుబాటులోకి రానున్నట్లు సంస్థ అధికారికంగా తెలిపింది. కథేంటంటే..: నివి (శ్రీ గౌరీ ప్రియ) తను ప్రేమించిన అబ్బాయి అజయ్ (త్రిగుణ్)తో కలిసి పెళ్లికి సిద్ధమవుతుంది. కానీ, తీరా ముహూర్త సమయానికి పెళ్లి పీటలెక్కాల్సిన ఆ కుర్రాడు తాను మరో అమ్మాయిని ప్రేమించానని చెప్పి.. బ్రేకప్ చెప్పి వెళ్లిపోతాడు. ఆమెని ఆ బాధ నుంచి బయట పడేసేందుకు మిత్రులు చెన్నైకి తీసుకెళ్లినా ఏ మార్పూ రాదు. పైగా ప్రేమ విఫలమైన బాధలో దేవదాసులా మందుకు బానిసవుతుంది. అలాంటి సమయంలో ఆమె ఉంటున్న ఇంట్లోకి స్టీవెన్ శంకర్ (కిరణ్ అబ్బవరం) అడుగు పెడతాడు. అతనొక అనాథ. దర్శకుడవ్వాలన్న ఆశతో చెన్నైలోకి అడుగు పెట్టిన అతనికి.. నివి ఫ్రెండ్స్ గ్యాంగే ఆశ్రయమిస్తారు. మొదట్లో స్టీవెన్ చేసే పనులు నివికి చిరాకు తెప్పించినా.. క్రమంగా అతని మాటలు, చేతలు తనలో మార్పు తెస్తాయి. ఈ క్రమంలోనే బ్రేకప్ బాధ నుంచి బయటపడి.. స్టీవెన్‌కి దగ్గరవుతుంది. మళ్లీ ఆమెలో ప్రేమ చిగురిస్తుంది. మరి ఆ తర్వాత వాళ్లిద్దరి ప్రయాణం ఎలా సాగిందనేది కథ.

# డిసి సక్సెస్‌తో మైత్రీమూవీ మేకర్స్ విజయోత్సవ వేడుక

టాలెంటెడ్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ ప్రధాన పాత్రలో నటించిన 'డిసి' చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకుని దూసుకుపోతోంది. ఈ సినిమా సాధించిన సంచలన విజయంతో చిత్ర పరిశ్రమలో ప్రశంసల జల్లు కురుస్తోంది. అయితే ఈ సినిమా సాధించిన సక్సెస్ నేపథ్యంలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మోస్ట్ అవేటెడ్ పాన్-ఇండియా ప్రాజెక్ట్ 'ఎఎ23' టీమ్ మరియు ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ అధినేతలు డైరెక్టర్ లోకేష్ కనగరాజ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. 'డిసి' మూవీ బ్లాక్‌బస్టర్ సక్సెస్‌ను పురస్కరించుకుని చిత్ర యూనిట్ ఘనంగా వేడుకలు నిర్వహించింది. ఈ సెలబ్రేషన్స్‌కు సంబంధించిన ప్రత్యేక ఫొటోలను మైత్రి మూవీ మేకర్స్ సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. 'డిసి చిత్రానికి అఖండ విజయం అందించినందుకు అభినందనలు లోకేష్ కనగరాజ్. ఇప్పుడు ఎఎ23 వంతు! అంటూ మైత్రీ రాసుకొచ్చింది. ప్రస్తుతం డీసీ సక్సెస్ మూడ్‌లో ఉన్న లోకీ త్వరలోనే 'ఎఎ23' ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించబోతున్నాడు.



# బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక

## శ్రీ కోట మైసమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి ఆగస్టు 16 ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్ అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :**
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. సూర్యాపేట పట్టణంలోని 48వ వార్డులో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, కౌన్సిలర్ వెలుగు వెంకన్న ఆహ్వానం మేరకు శ్రీ కోట మైసమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలు, ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే గొప్ప పండుగ అని అన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న తెలంగాణ సంస్కృతికి బోనాల పండుగ ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చిందని, అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలవడం తెలంగాణ ప్రజల సంప్రదాయంలో ఎంతో విశిష్టమైనదని



పేర్కొన్నారు. బోనాల పండుగ సందర్భంగా ప్రజలు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ తమ మొక్కులు చెల్లించుకుంటారని తెలిపారు. అమ్మవారి చల్లని ఆశీస్సులతో సూర్యాపేట నియోజకవర్గంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యం, ఆనందం వెల్లివిరియాలని కోరుకున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, రైతులు సంతోషంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు చెప్పారు. బోనాల పండుగ కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమం మాత్రమే కాకుండా తెలంగాణ ప్రజల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, ఐక్యతను చాటిచెప్పే పండుగగా నిలుస్తుందని అన్నారు. ప్రజలందరూ బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, మాజీ కౌన్సిలర్ ఈర్ల వాసు, మాజీ జెడ్పిటిసి చింతమళ్ల రమేష్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, మున్సిపల్ కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, గుణగంటి హేమ సతీష్, మన్నెం అరుణ మల్లేష్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, జిల్లా సేవాదళ్ చీఫ్ ఆలేటి మాణిక్యం, కాంగ్రెస్ నాయకులు నాగేల్లి అరుణ్ కుమార్, నరేందర్ నాయుడు, రాచకొండ శ్రీనివాస్, జూలకంటి నాగరాజు, చెంచల నిఖిల్, అబ్బాస్, గుగులోత్ నాగు నాయక్, పడిదల రవి, గుణగంటి సైదులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గాజులరామారంలో శ్రీ నల్ల పోచమ్మ, రేణుక ఎల్లమ్మ దేవాలయ ద్వితీయ వార్షికోత్సవం

**కుత్బుల్లాపూర్ ఆగస్టు 16 ప్రజా న్యూస్ నెట్వర్క్ :**
గాజులరామారంలో శ్రీ నల్ల పోచమ్మ, రేణుక ఎల్లమ్మ అమ్మవార్ల దేవాలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు మేడ్చల్--మల్కాజ్‌గిరి డీసీసీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా కూన శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ అమ్మవార్ల ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవార్లను ప్రార్థించినట్లు తెలిపారు.అనంతరం కమిటీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్ ని శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు విజయ్ కుమార్, కిరణ్, వెంకటస్వామి, రవి, జ్ఞానేశ్వర్, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు యాము సాగర్, మరియు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# సందయ్యకుంట సమీపంలో అక్రమ షెడ్డు నిర్మాణం!

## బహదూర్‌పల్లిలో అనుమతుల్లేని భారీ షెడ్డు?

**కుత్బుల్లాపూర్ ఆగస్టు 16 ప్రజా న్యూస్ నెట్వర్క్**
దుండిగల్ సర్కిల్ పరిధి బహదూర్‌పల్లి లోని సర్వే నం.62, సందయ్యకుంట సమీపంలో, సద్గురు ఇంటర్నేషనల్ స్కూల్ వెనకాల సుమారు 1,000 గజాల విస్తీర్ణంలో భారీ షెడ్డు నిర్మాణం కొనసాగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. మున్సిపాలిటీ లేదా హెచ్‌ఎండీఏ నుంచి అనుమతులు తీసుకున్నారా? లేదా? అనే విషయంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.ఈ నిర్మాణంపై టౌన్ ప్లానింగ్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కుత్బుల్లాపూర్ పరిధిలో అనుమతుల్లేని షెడ్లు, బహుళ అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.చెరువు సమీపంలో నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రాంతం ఎఫ్‌టీఎల్ లేదా బఫర్ జోన్ పరిధిలోకి వస్తుందా? అనే అంశంపై అధికారులు విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు దృష్టి సారించి, నిర్మాణానికి సంబంధించిన అనుమతులను పరిశీలించి నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



# పుంభావ సరస్వతి వానమామలై

**నేడు వానమామలై వరదాచార్యులు జయంతి**

**తెలుగుదేశం ఆధునికపు కవితా పోకడలకు అలవాటు పడిన కాలమది. భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం, వచనకవిత్వం లాంటి ఎన్నో నూతన సాహిత్య ప్రయోగాలాతో వర్ధిల్లుతున్న కాలంలో, ప్రాచీన కవితారీతులతో ప్రజలను మెప్పించిన కవి వానమామలై. అమూల్య సాహిత్య సంపదను తెలుగువారి కందించిన అద్వితీయ కవితా విశారదుడు, వాగీశ్వరీ మంత్ర సిద్ధిని పొందిన మహనీయుడు పుంభావ సరస్వతి వానమామలై వరదాచార్య. ఒక మహాకవి పోతన చరిత్రను మరోకవి గ్రంథస్థం చేయడం విశేషమే మరి.**



వానమామలై (1914-1984), 1914 ఆగస్టు 16న వరంగల్ జిల్లా మడికొండ గ్రామంలో వైఖానస బ్రాహ్మణుల పండిత కుటుంబంలో జన్మించారు. రైతు కుటుంబములో జన్మించిన వరదాచార్యులు ఏడవ తరగతి వరకు మాత్రమే చదివి ఎల్... సంస్కృతాంధ్ర సాహిత్యం, తార్కికం, వేదాంతం, వ్యాకరణాలను అభ్యసించారు. సంస్కృతం, తెలుగు, ఉర్దూ, హిందీ, ద్రవిడం, మరాఠీ, ఇంగ్లీషు భాషలలో పట్టు సాధించారు. హరికథాగానంలో ప్రావీణ్యతను సంతరించు కున్నారు. ఈయన అన్నలైన వానమామలై వేంకటాచార్యులు, వానమామలై లక్ష్మణాచార్యులు, వానమామలై జగన్నాథా చార్యులు కూడా సాహిత్యకారులే. కాళోజీ, పల్లా దుర్గయ్య, ఆచార్య బిరుదురాజు రామరాజువంటి సాహితీ దిగ్గజాలు మడికొండకే చెందిన వారేకాక, ఆయన ఆత్మీయులు కూడా.

ఆయన సహజ పాండిత్యాన్ని గుర్తించిన అప్పటి హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా నిజామాబాద్ జిల్లా దోమకొండ జనతా కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమ నిర్వాహకుడిగా నియమించారు. తర్వాత ఆంధ్ర సారస్వత పరిషత్తునుండి విశారద పట్టా పుచ్చుకున్నారు. విశారద పూర్తయ్యాక చెన్నూర్ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యి 13 సంవత్సరాలు ఉపాధ్యాయుడిగా పనిచేసి 1972లో పదవీ విరమణ చేశారు. చెన్నూరులో వేదపాఠశాల నెలకొల్పారు. 1972లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పి.వి.నరసింహారావు శాసనమండలికి నామినేట్ చేయగా 1978 వరకు శాసనమండలి సభ్యుడిగా కొనసాగారు.

1968లో పోతన చరిత్రము గ్రంథానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ అవార్డు, 1971లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ విశిష్ట సభ్యత్వము, 1973లో కరీంనగర్ జిల్లా కోరుట్లలో భారతీ సాహిత్య సమితి వారిచే గండపెండేరం, స్వర్ణ కంకణం, రాత్నాభిషేకం,1976లో సంపూర్ణానంద సంస్కృత విశ్వ విద్యాలయం, వారణాసి వారిచే డి.లిట్ వాచస్పతి గౌరవ పట్టా పొందారు. అభినవ కాళిదాసు, మహాకవి శిరోమణి, ఆంధ్ర కవిత ఉత్ప్రేక్ష చక్రవర్తి, అభినవ పోతన, ఆంధ్ర కవివతంస, మధురకవి, కవి కోకిల, కవిశిరో వతంస తదితర బిరుదాంచితులైనారు.

తెలంగాణ ప్రజలను జాగృతం చేసేందుకు హైదరాబాద్ రాజ్యంలో (తెలంగాణ) నిజాం నియంతృత్వ పాలనను వర్ణిస్తూ అనేక పాటలు, పద్యాలు రాశారు. పౌరాణికుడిగా ప్రదర్శనలు ఇచ్చారు. హరికథలు, పురాణాలు చెప్పారు. "పోతన చరిత్రము" వ్రాసి "అభినవ పోతన"గా వాసికెక్కిన వానమామలై తెలంగాణా కవులలో అగ్రగణ్యుడు, అపూర్వ సాహితీ దురంధరుడు.... దాశరథి కృష్ణమాచార్యులకు అతి సన్నిహితులు, ఆచార్య సి. నారాయణరెడ్డికి అత్యంత ఆప్తుడు, ఎన్నో గేయకృతులు, వ్యాసాలు, నాటకాలు, బుఱ్ఱకథలు ఎన్ని వ్రాసినా.. తెలుగు సాహిత్యంలో ఆయనకు సుస్థిర స్థానాన్ని సముపార్జించి పెట్టింది "పోతన చరిత్రము". మహాభాగవత కర్త మహాకవి బమ్మెర పోతన్న జీవిత విశేషాలను అద్వితీయ ప్రబంధంగా అందించిన ఘనత మన వరదన్నదే. అలా తెలుగు రచయితల సంఘం ఆయనకు "అభినవ పోతన" బిరుదునిచ్చి సత్కరించింది. ఆయన వరదన్న పుట్టి పెరిగింది మడికొండలోనే అయినా స్థిరపడింది తాత ముత్తాతల ఊరైన చెన్నూరు లోనే.

**'వరదన్నకు చిన్ననాటనే బాల్యగురువైన కాళోజీ రంగారావు శ్రీరామ తారక మంత్రోపదేశం గావించారు. మంథెనవాసి మేనమామ తిరువరంగం గోపాలాచార్యులు వాగీశ్వరి మంత్రోపదేశం చేయగా, ఖాజీపేట సమీపంలోగల మెట్టుగుట్టపై ఎనభైరోజులు కఠోరదీక్షతో ఉపాసించి వాణీ కటాక్ష వరసిద్ధిని పొందినట్లు చెపుతారు. ఇతని శతజయంతి ఉత్సవాలు 18-8-2011 నుండి 18-8-2012 వరకు జరిగాయి. ఈ సందర్భంగా అనేక సభలు సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నూర్ లోని జగన్నాథ ఆలయానికి ఎదురుగా ఉన్న స్థలంలో ఆయన కాంస్య విగ్రహాన్ని నెలకొల్పారు. క్షయవ్యాధి పీడితుడై, ఊపిరి తిత్తులకు పది సార్లు శస్త్రచికిత్సతో ఒక ఊపిరితిత్తి తోనే కడదాకా జీవించి,1984, అక్టోబరు 30నఈ లోకాన్ని వీడి వెళ్ళారు.**

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494